కూరగాయల సాగులో ఆదర్శం

- తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు
- 22ఏళ్లుగా సాగు చేస్తున్న లింగి, కుములాపూర్ రైతులు



రైతుబజార్‌లో కూరగాయలు విక్రయిస్తున్న రైతులు



సాగవుతున్న ఆకుకూరలు

తలమడుగు: మండే వేసవిలో కూరగాయలు సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు రైతులు. 22 ఏళ్లుగా లింగి, కుచులాపూర్ రైతులు కూరగాయలు, ఆకుకూరలు పండిస్తూ.. ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు. కూరగాయలకు మంచి డిమాండ్ ఉండడంతో సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. పండించిన వాటిని జిల్లా కేంద్రంలోని రైతుబజార్‌కు తరలించి విక్రయిస్తున్నారు. గతంలో పత్తి, సోయాబీన్, జొన్న, ఇతర పంటలు సాగు చేసేవారు. కూరగాయల సాగు లభాదాయకంగా ఉండడంతో ప్రత్యేక దృష్టి సాగించారు. బోరుబావుల్లో నీరు ఉండడంతో ఎడాది పొడువున సాగుచేస్తున్నారు. రెండు నెలలు కష్టపడితే పంటలు చేతికి వస్తుందని చెబుతున్నారు.

రవాణా చేసేందుకు ఇబ్బంది..

గ్రామాల్లో గత 22 ఏళ్లుగా కూరగాయలు సాగు చేస్తున్నారు. లింగి గ్రామానికి గతంలో జిల్లా కేంద్రం నుంచి రైతుబజార్ వరకు ప్రత్యేక బస్సును నడిపేవారు. కరోనా సమయం నుంచి బస్సు సర్వీస్‌ను రద్దు చేశారు. కొన్ని సందర్భాల్లో రవాణాకు వాహనాలు అందుబాటులో లేక కూరగాయలు పడయ్యేవి. ప్రైవేట్ వాహనాలకు అధిక చార్జీలు చెల్లించి తీసుకెళ్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ అధికారులు ప్రత్యేక బస్సు నడిపించాలని కోరుతున్నారు. టమాట, వంకాయ, క్యాబేజీ, పచ్చిమిర్చి, బెండకాయ, అలసంద, కొత్తిమీర, పాలకూర, ఆకుకూరలు ఎక్కువగా సాగు చేస్తున్నారు, తక్కువ నీటితో కూరగాయలు పండిస్తున్నారు.

అవగాహన కల్పించని అధికారులు..

హార్టికల్చర్‌శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. కూరగాయలు, పండ్ల తోటలను ప్రోత్సహించేందుకు రైతులకు ఎప్పటికప్పుడు మేలకువలు చెప్పాలి. కానీ గ్రామాల్లో అలాంటి కార్యక్రమాలు చేపట్టడం లేద. ఎన్నో ఏళ్ల నుంచి కూరగాయలు సాగు చేస్తున్నాం కానీ అధికారులు సలహాలు, సూచనలు ఇవ్వడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కూరగాయల సాగుపై సూచనలు, సలహాలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

లాభాలు వస్తున్నాయి



గత 22 ఏళ్ల నుంచి కూరగాయలు పండిస్తున్నాను. ఉదయం వెళ్లి కూరగాయలు తీసుకువచ్చి జిల్లా కేంద్రంలోని మార్కెట్‌కు తరలించాల్సి ఉంటుంది. మూడు కాలాల్లో పంటలు సాగుచేస్తూ.. లాభాలు పొందుతున్నాను.

– రాగిరామ్ కిషన్, లింగి

రాయితీపై విత్తనాలు అందించాలి



కూరగాయలు సాగు చేసే రైతులకు ఆర్టికల్చర్‌శాఖ ద్వారా రాయితీపై విత్తనాలు అందించాలి. దీంతో రైతులకు ఆర్థిక భారం తగ్గుతోంది. ప్రభుత్వం దీనిపై దృష్టి సారించాలి. కూరగాయలకు మంచి డిమాండ్ ఉంది.

బుచ్చన్న, లింగి

అటెన్షన్ ప్లీజ్.. పీహెచ్‌సీ గోడపై మొక్కలు



తాంసి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనంపై మొక్కలు పెరగడంతో గోడలకు పగుళ్లు వస్తున్నాయి. అయినా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి మొక్కలు తొలగించి, పగుళ్లను మూసివేయాలని మండలవాసులు కోరుతున్నారు.

– సంబంధిత అధికారి: శ్రావ్య, మండల వైద్యాధికారి, తాంసి

క్లుప్తంగా

కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠాపన



యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

నార్నూర్: మండల కేంద్రంలోని బాలాజీ గుట్టపై ఉన్న శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. గురువారం మహాపూజలో భాగంగా యజ్ఞం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. నేడు ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి చేతుల మీదుగా సాగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఉచిత వైద్య పరీక్షలు

ఉట్నూర్‌రూరల్: సీఎస్‌సీ హెల్త్‌కేర్ ఆధ్వర్యంలో గురువారం లేబర్‌కార్డు ఉన్న కార్మికులకు ఉట్నూర్ గ్రామ పంచాయతీలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించినట్లు జిల్లా కోఆర్డినేటర్ సయ్యద్ పర్వేజ్ అన్నారు. ఒకొక్కరికీ 50 వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. లేబర్ కార్డు కలిగి ఉన్న వారు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో తిరుమల, ప్రత్యేకాధికారి మహేశ్, సామాజిక కార్యకర్త అజంత్ ఖాన్, హెల్త్‌కేర్ క్యాంప్ కోఆర్డినేటర్ సుఫీ, రషీద్, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు గురువారం సీఎం కేసీఆర్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్నల ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. వారు మాట్లాడుతూ.. రిమ్స్‌లో కాంట్రాక్ట్ కార్మికులుగా పని చేస్తున్న తమను ఇటీవల కాంట్రాక్టర్ విధుల నుంచి తొలగించినట్లు పేర్కొన్నారు. ఈవిషయాన్ని ఎమ్మెల్యే జోగు రామన్న దృష్టికి తీసుకెళ్లగా కాంట్రాక్టర్ తిరిగి తమను విధుల్లోకి తీసుకున్నట్లు తెలిపారు. సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే జోగు రామన్నలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో చిన్నయ్య, రిజ్వాన్, కవిత, సునంద, సునీత, ఖుర్షీద్, రవి, సాయికృష్ణ పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

తాంసి: భీంపూర్ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎంపీపీ రత్నప్రభ అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు తమ నివేదికలతో హాజరు కావాలన్నారు.

అర్చరీ కిట్ అందజేత

ఎదులాపురం: అర్చరీలో రాణిస్తున్న టేకం లక్ష్మీ అనే అర్చరీ క్రీడాకారిణికి గురువారం జిల్లా గిరిజన క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి కిట్‌ను అందజేశారు. గిరిపుత్రులు సహజసిద్ధంగా అర్చరీలో ప్రతిభ కలిగి ఉంటారని కొనియాడారు. కోచ్ మారుతిని అభినందించారు. వారి వెంట సమ్మర్ క్యాంపు కన్వీనర్ లక్ష్మణ్, తదితరులు ఉన్నారు.

వెలగని వీధి దీపాలు

తాంసి: భీంపూర్ మండలంలోని అర్లి(టి) గ్రామంలో ప్రధాన రహదారిపై గత కొన్ని రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో రాత్రిపూట ప్రజలు బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. వీధి దీపాలు అమర్చాలని సర్పంచ్‌కు విన్నవించినా.. పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పంచాయతీ అధికారులు స్పందించి వీధి దీపాలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

హరితహారాన్ని విజయవంతం చేద్దాం



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో

నేరడిగొండ: హరితహారాన్ని విజయవంతం చేద్దామని ఎంపీడీవో అబ్దుల్ సమద్ అన్నారు. గురువారం మండలంలోని వడూర్‌లో నర్సరీతో పాటు బృహత్ పల్లెప్రకృతి వనాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. నర్సరీ, బృహత్ పల్లె ప్రకృతి వనంలో మొక్కలు ఎండిపోకుండా చూడాలన్నారు. ప్రతీరోజు నీటిని అందించాలన్నారు.

శిక్షణ తరగతులకు హాజరైన నాయకులు

బోథ్: ఏఐసీసీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో గురువారం నిర్వహించిన శిక్షణ శిబిరానికి లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ మిషన్ బోథ్, ఖానాపూర్ సమన్వయకర్తలు పసుల చంటి, మల్లెపూల సత్యనారాయణలు హాజరయ్యారు. నియోజకవర్గాల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలిండియా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కోఆర్డినేటర్ కొప్పుల రాజు, టీపీసీసీ విభాగాల అధ్యక్షులు పాల్గొన్నట్లు వారు పేర్కొన్నారు.

సృజనాత్మకత వెలికి తీసేందుకే శిక్షణ



అడవిమల్లెలు కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

ఆదిలాబాద్: విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకత వెలికితీసేందుకు వేసవి శిక్షణ శిబిరాలు దోహదపడుతాయని కవి ఉదారి నారాయణ అన్నారు. గిరి విద్యార్థుల వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని ఆదిలాబాద్ ఆకాశవాణి కేంద్రంలో అడవి మల్లెలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆలపించిన గీతాలు అలరించాయి. పది రోజుల నుంచి విద్యార్థులకు దేశభక్తి, సామాజిక కవితలు, పాటలు, కథలు నేర్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మినారాయణ, ట్యూటర్ జాదవ్ అశోక్, రేడియో స్టేషన్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

'సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలం'



ఇంటింటికీ సీపీఐ కార్యక్రమంలో నాయకులు

తలమడుగు: ప్రజా సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం అయ్యాయని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి సిర్ర దేవేందర్ అన్నారు. గురువారం మండలంలోని లల్‌గడ గ్రామంలో ఇంటింటికీ సీపీఐ నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ.. ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నిత్యావసర ధరల పెరుగుదలతో పేద, మధ్యతరగతి ప్రజలపై భారం పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాచర్ల శ్రీనివాస్ యాదవ్, చిల్కా దేవేదాస్, దుర్వా కిషన్, ఆత్రం రాములు, పాండురాంగ్, విశాల్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం



ప్రశంసాపత్రం అందుకుంటున్న విద్యార్థి

తాంసి: మండలంలోని కప్పర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి కేమ కరణ్ పపదో తరగతి ఫలితాలలో 10 జీపీఏ సాధించి మండల టాపర్‌గా నిలిచాడు. గురువారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ కాన్ఫరెన్స్ హాల్‌లో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉత్తమ జీపీఏ సాధించిన విద్యార్థులను సన్మానించి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఇందులో భాగంగా కేమ కరణ్ విద్యార్థిని కలెక్టర్ రాహుల్‌రాజ్, అడిషనల్ కలెక్టర్ రిజ్వాన్‌భాషా, ట్రెయినీ కలెక్టర్ శ్రీజ, డీఈవో ప్రణీత సన్మానించారు. ప్రశంసాపత్రం అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు కిష్టన్నను కూడా అధికారులు సత్కారించారు.

రామాలయ నిర్మాణానికి రూ.5లక్షల విరాళం

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో సీతారామచంద్ర స్వామి ఆలయ నిర్మాణానికి బీజేపీ నియోజకవర్గ నాయకురాలు, పెంబి జెడ్పీటీసీ జానుబాయి–రమేశ్ దంపతులు గురువారం రూ.ఐదు లక్షల విరాళం అందజేశారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమిటీ సభ్యుల సమక్షంలో విరాళం అందజేశారు. బుక్క వెంకటేశ్, లాండేరి కిషన్, సతీశ్‌రావు దేశ్‌పాండే, పడాల రాజశేఖర్, నాయిని సంతోష్, రాములు, గంగాధర్, ఉపేందర్, శ్రావన్, సురేశ్, పవన్ ఉన్నారు.

బోనమెత్తిన కొండుకూర్



కడెం: మండలంలోని కొండుకూర్ గ్రామంలో నూతన ఆలయంలో పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు ముగిశాయి. గురువారం బోనాల పండుగ వైభవంగా నిర్వహించారు. మహిళలు, యువతులు నెత్తిన బోనాలతో డప్పుచప్పుళ్లతో ప్రధాన వీధుల గుండా ఆలయానికి వెళ్లారు. మట్టి కుండల్లో వండిన నైవేద్యాన్ని మోదుగ ఆకుల్లో అమ్మవారికి సమర్పించారు.

'కంటివెలుగు' సద్వినియోగం చేసుకోవాలి

ఉట్నూర్‌రూరల్: కంటివెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ జైవంత్ రావు అన్నారు. గురువారం మండలంలోని బీర్సాయిపేట గ్రామ పంచాయతీ భవనంలో కంటివెలుగు ప్రారంభించారు. ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని కంటి పరీక్షలు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఆత్రం లచ్చు పటేల్, సర్పంచ్ అంకవ్వ, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

తలమడుగు: మండలంలోని అర్లి(కె), తలమడుగు, డోర్లి గ్రామాల్లో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బీఆర్‌ఎస్ నాయకులు పంపిణీ చేశారు. మండల కన్వీనర్ వెంకటేశ్ మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న వారికి సీఎంఆర్‌ఎఫ్ అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు కాటిపల్లి శ్రీనివాసరెడ్డి, గోక జీవన్ రెడ్డి, మగ్గిడి ప్రకాశ్, గంగాధర్, సర్పంచ్ కిష్టన్న, వెంకటరెడ్డి, రామయ్య పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

ఉట్నూర్‌రూరల్: మాజీ మంత్రి ఆల్ ఇండియా బంజార సేవా సంఘం జాతీయ అధ్యక్షుడు అమర్‌సింగ్ తిలావత్ సమక్షంలో ఆదిలాబాద్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా నరేశ్ జాదవ్, జనరల్ సెక్రటరీగా బానోత్ జగన్, ఆడె సురేశ్, ఉపాధ్యక్షుడిగా ధన్‌లాల రామేశ్వర్, రూపావత్ అమర్‌సింగ్, పవన్ జాదవ్, బలిరాం, రామారావు, సునీల్, రాజేశ్, తదితరులను ఎన్నుకున్నారు.

బియ్యం అందజేత



బియ్యం అందజేస్తున్న సాకటి దశరథ్

తాంసి: పేదింటి ఆడపడుచు కుటుంబానికి బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్ అండగా నిలిచాడు. మండల కేంద్రానికి చెందిన రమేశ్, సుజాత దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గత నాలుగేళ్ల క్రితం రమేశ్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా భార్య సుజాత కూతుళ్లను పోషిస్తోంది. ఇటీవల పెద్ద కుమార్తె వివాహం నిశ్చయం కాగా 14న వివాహం జరుగనుంది. దీంతో బీజేపీ నాయకుడు సాకటి దశరథ్ క్వింటాల్ బియ్యం అందజేశాడు. వారి వెంట సంతోశ్‌రెడ్డి, పూర్ణచందర్, సుభాష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై కళాజాత



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

ఇంద్రవెల్లి: మండలంలోని సమాక గ్రామంలో గురువారం తెలంగాణ సాంస్కృతిక సారథి కళాజాత బృందం ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. రక్త హీనత, కంటివెలుగు, మాత శిశు మరణాలు, బాల్య వివాహాలు, పారిశుధ్యం, ఆసరా, హరితహారం, మరుగుదొడ్ల నిర్వహణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాకారుల బృందం టీం లీడర్ కుమ్ర నగేశ్, కళాకారులు రాథోడ్ శంకర్, వెంకట్‌రావ్, రవీంద్ర, మురళి, ఆశిష్ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించేందుకు కృషి

- మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్



పనులు ప్రారంభిస్తున్న జోగు ప్రేమేందర్

ఆదిలాబాద్‌రూరల్: విద్యారంగంలో అనేక సంస్కరణలు అమలు చేస్తూ.. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. గురువారం మావల మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో మనఊరు.. మన బడి కింద రూ. 64లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రమీలా, ఉప సర్పంచ్ మహేందర్ యాదవ్, జెడ్పీటీసీ నల్ల వనిత, ఎంపీడీవో అరుణ, ఎంఈవో జయశీల, ఏఈ అరుణ్, ఏవన్, ఆసీఫ్, గంగుల కిరణ్, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలన

ఎదులాపురం: పట్టణంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ గురువారం పరిశీలించారు. నూతన మున్సిపల్ కార్యాలయ పనులు తుదిదశకు చేరుకున్నాయని, త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పురపాలక కార్యాలయంలో ఆయా విభాగాలకు కేటాయించిన గదులను పరిశీలించారు. వైస్ చైర్మన్ జహీర్ రంజాని, కమిషనర్ శైలజ, ఏఈ అరుణ్, డీఈ తిరుపతి, కౌన్సిలర్ మోబిన్ తదితరులు పాల్గొన్నారు.

15నుంచి సీఎం కప్ క్రీడా పోటీలు

బేల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 15 నుంచి 17 వరకు మండల స్థాయి సీఎం కప్– 2023 పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నేరల్‌వార్ మహేందర్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు పాల్గొనాలని, కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

బజార్‌హత్నూర్: ఈనెల 15, 16, 17 తేదీలలో సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో చౌహాన్ రాధ తెలిపారు. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, 100 మీటర్లు, 400 మీటర్ల పరుగు పందెం పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తిగల యువతీ, యువకులు ఈనెల 13లోగా స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో క్రీడాకారులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

ఇచ్చోడ: ఈనెల 15 నుంచి రెండు రోజుల పాటు నిర్వహించే సీఎం కప్ పోటీలను విజయవంతం చేయాలని ఎంపీడీవో రాంప్రసాద్ అన్నారు. గురువారం పోటీలు నిర్వహించే జిల్లా పరిషత్ పాఠశాల గ్రౌండ్‌ను పరిశీలించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉంటున్న క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం



ఒంటి కాలిపై నిల్చొని నిరసన తెలుపుతున్న వీవోఏలు

ఇంద్రవెల్లి: వీవోఏల సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం చేస్తామని వీవోఏల మండల అధ్యక్షుడు షేక్ ఫెరోజ్ అన్నారు. గురువారం మండలంలోని అమరవీరుల స్తూపం వద్ద ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలిపారు. వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో వీవోఏల సంఘం మండల ఉపాధ్యక్షుడు కోట్నాక్ బారిక్‌రావ్, జుగ్నాక్ రాందాస్, జైపాల్, చంద్రకాంత్, ఉమా, జానకి, జలదేవి, మహేశ్వరి, నందిని, సునీత పాల్గొన్నారు.

ఇచ్చోడ: వీవోఏల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్యామ్‌రావు ఆరోపించారు. గురువారం వీవోఏలు చేస్తున్న నిరవధిక సమ్మెకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో వీవోఏల సంఘం నాయకుడు బరుకుంట సుభాష్, కామ్రె గంగాధర్, పుర్కమారుతి, పుల్లెడి భీముడు, అనిత, మల్లేశ్, రమేశ్ పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై అవగాహన



మాట్లాడుతున్న తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్

బేల: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం రాజకీయ పార్టీల మండల అధ్యక్షులు, బూత్‌లెవల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్ మాట్లాడుతూ.. ఎటువంటి పొరపాట్లు లేని ఓటరు జాబితా సంసిద్ధం చేస్తున్నామని, అభ్యంతరం ఉంటే చెప్పాలన్నారు. తొలగించబడిన ఓటరు పేర్ల జాబితా, కొత్త ఓటరు నమోదు, ఫొటో తప్పిదాలు, డబుల్ ఓటర్ల గుర్తింపు, మార్పులు, చేర్పుల గురించి అవగాహన కల్పించారు. సమావేశంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నారాయణ, గీత, సిబ్బంది పాల్గొన్నారు.

లంపీస్కిన్ లక్షణాలు ముందస్తుగా గుర్తించాలి

బజార్‌హత్నూర్: పశువులకు లంపీస్కిన్ (ముద్ద చర్మ) వ్యాధి సోకినట్లు రైతులు ముందస్తుగా గుర్తిస్తే నివారణ చర్యలు తీసుకుంటామని పశువైద్యాధికారి పర్వేజ్ అహ్మద్ తెలిపారు. గురువారం మండలంలోని పిప్రి గ్రామంలో పశువులకు లంపీస్కిన్ వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం ప్రారంభించారు. ముందస్తుగా గుర్తించి చికిత్స అందిస్తే ఎలాంటి ప్రమాదం ఉండదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కవిత రగన్‌రెడ్డి, ఎంపీటీసీ పండగ మురళీమోహన్, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.